క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపెల్లి లోని శ్రీ శివరామ క్షేత్రంలో ఆదివారం ప్రసన్నాంజనేయస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, చెన్నకేశవస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

బడిబాట



దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు రామస్వామి, జ్యోతిలక్ష్మి, భద్రమ్మ మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని కోరారు. విద్యార్థులను నమోదు చేసుకున్నారు.

మనుబోతులగడ్డలో..



ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం కాకాని అశోక్ మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యాబోధన అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, తదితర అనేక వసతులు కల్పిస్తోందని చెప్పారు. తొలుత ఉపాధ్యాయులు గ్రామంలో విద్యార్థుల సంఖ్యను నమోదు చేసుకున్నారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ కమిటీ చైర్మన్ ధర్మి, ఉపాధ్యాయులు వాగ్య, వీరన్న, అశోక్, బిల్లా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'భూభారతి' హెల్ప్‌డెస్క్

ఖానాపురం : భూభారతి చట్టం కింద రైతుల నుంచి వచ్చే దరఖాస్తుల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. మండలంలోని ఇప్పటికే రంగాపురం, కొత్తూరు, మంగళవారిపేట, ఐనపల్లి, దబ్బీర్‌పేట గ్రామాల్లో సదస్సులు నిర్వహించి భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. సదస్సుల్లో దరఖాస్తులు ఇవ్వలేకపోయిన రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ పని చేస్తుందని చెప్పారు. భూసంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

దుగ్గొండి : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రేపు (మంగళవారం) విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ రామ్మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులకు సమస్యలు నేరుగా వివరించవచ్చని పేర్కొన్నారు. సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు, ప్రజలు వేదికకు హాజరై ఫిర్యాదు చేయాలని సూచించారు. అధికారులు సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. మండలానికి చెందిన రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే వేదిక దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన నర్సంపేటలోని సర్వాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. సర్వాపురం వడ్డెర కాలనీకి చెందిన ఓర్సు రాకేష్ (28)కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మే 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండకు అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా రాకేష్ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య శ్రావణి, తల్లిదండ్రులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

ఊరించి.. ఉసూరుమనిపించి..

- వర్షాల్లేక అన్నదాత అగచాట్లు
- విత్తనాలు మొలకెత్తడంలో ఇబ్బందులు



మొలకలను కాపాడుకునేందుకు నీరు పారిస్తున్న రైతు

సంగెం : ముందస్తు వర్షాలు ఊరించి ఉసూరుమనిపించాయంటూ రైతులు వేదనకు గురౌతున్నారు. ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతు పవనాలు వచ్చాయని వాతావరణ శాఖ ప్రకటించడం, అందుకు అనుగుణంగానే రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలకు బదులు వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. బలమైన కార్తెలో విత్తనాలు నాటితే పంట దిగుబడి బాగుంటుందన్న ఆశతో మే నెల చివరి వారంలో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న సాగు చేపట్టారు. తీరా చూస్తే వాతావరణం మారిపోయి వానా కాలం ప్రారంభమైనా ఎండాకాలాన్ని తలపిస్తున్న ఎండలు అన్నదాతల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరుణుడు మొహం చాటేయడంతో అనేక వ్యయప్రయాసలకోర్చి నాటిన పత్తి విత్తనాలను మొలకెత్తించడంలో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు.

సాగు విస్తీర్ణం 29 వేల 50 ఎకరాలు

మండలంలో సాగుకు అనుకూలమైన వ్యవసాయ భూమి 29 వేల 50 ఎకరాలు. ఇందులో 8 వేల ఎకరాల్లో వరి, 14 వేల 500 ఎకరాల్లో పత్తి, 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 700 ఎకరాల్లో ఆయిల్‌పామ్, 300 ఎకరాల్లో పసుపు, 200 ఎకరాల్లో కంది, 100 ఎకరాల్లో మిర్చి పంటలు సాగవుతున్నట్టు వ్యవసాయ శాఖ అధికారి యాకయ్య ధ్రువీకరించారు.

ముందస్తు సాగుతో..

ముందస్తు వానలు ఊరించడంతో అన్నదాతలు ఖరీఫ్ పంటల సాగుకు సమాయత్తమయ్యారు. ఏప్రిల్, మేలో కురిసిన వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకున్న మొక్కజొన్న, పత్తి విత్తనాలు వేశారు. వరి నారుమడులు సిద్ధం చేసి నారు పోయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే మండలంలో 80 శాతానికిపైగా రైతులు పత్తి విత్తనాలు నాటారు. ఇదిలా ఉండగా వర్షాల్లేక విత్తనాలను మొలకెత్తించే దిశగా నీరు పారించడంలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. నీటి వసతి లేని రైతులు వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. మురిపించిన తొలకరి ఆగం చేసిందంటూ రైతులు వేదనకు గురవుతున్నారు. మరో రెండు, మూడ్రోజుల్లో వర్షాలు కురిస్తేనే సరి.. లేదంటే నాటిన విత్తనాలు వట్టిపోయినట్టేనని మండల రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి



ఎకరానికి రూ.15 వేలతో నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నా. ఇప్పటికే దుక్కి దున్నడానికి రూ.7 వేలు, అచ్చు తోలడానికి వెయ్యి రూపాయలు, పత్తి విత్తనాలకు రూ.2700, వరినాట్లకు రూ.1200 కలిపి మొత్తం ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి పెట్టా. వర్షాల జాడలేకపోవడంతో స్ప్రింక్లర్లతో నీరు పారిస్తున్నా. విత్తనాలు మొలకెత్తకపోతే రూ.50 వేల నష్టం ఖాయం.

\- సూదం మల్లయ్య, రైతు, గాంధీనగర్

పంచాయతీ ఎన్నికల్లో గెలుపు ఖాయం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నల్లబెల్లి : పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొండాయిల్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రేణులకు సూచించారు. అనంతరం కొండాయిల్‌పల్లి, దస్తగిరిపల్లి గ్రామాలకు చెందిన అనుముల మహేందర్‌రెడ్డి, అనుముల హరీశ్‌రెడ్డి బాబు, ప్రశాంత్, తదితరులు పార్టీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తడుక వినయ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుంపుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా రణధీర్



దుగ్గొండి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా రావుల రణధీర్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన నీలోజు వెంకటేశ్వర్లు వరంగల్‌లోని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. విధుల్లో చేరిన సందర్భంగా ఎస్సై రణధీర్ మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

సన్మానం



రాయపర్తి : ఎస్సై ముత్యం రాజేందర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. ఫిర్యాదుదారుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కృష్ణమాచార్యులు, కృష్ణారెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, వనజారాణి, కోతి కల్యాణ్, సుదర్శన్‌రెడ్డి, కోటేశ్వర్, శ్రీనివాస్, అఫ్రోజ్, కాశీనాథం, యాకూబ్, యాకయ్య, తీగల సాయిలు, రాజేంద్రప్రసాద్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారంలో సేవాభావం కీలకం

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి



దుకాణాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

రాయపర్తి : వ్యాపారంలో రాణించాలంటే సేవా భావం కీలకమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మండలంలోని పెర్కవేడుకు చెందిన అబ్బోజు సేనాపతి ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ అనుబంధ శ్రీరామ మన అగ్రిటెక్ దుకాణాన్ని కృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. యువత సన్మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. వ్యాపారం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెండ్లి మహేందర్‌రెడ్డి, నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, కాశీనాథం, కుంట రమేశ్, తీగల సాయిలు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర శివారులోని గొర్రెకుంట కట్ట మల్లన్న ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. స్వీపర్ ఆదివారం తెల్లవారుజామున ఆలయానికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉండడంతో ఈఓకు సమాచారం అందించడంతో చోరీ వెలుగులోకి వచ్చింది. దొంగలు రెండు హుండీలను పగులగొట్టి రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లినట్టు చెప్పారు. ఆలయంలో చోరీ చర్చనీయాంశంగా మారింది. ఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మహేందర్ తెలిపారు.

కల్యాణ మండప నిర్మాణానికి కృషి

- గౌడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు లింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య

నర్సంపేట : నర్సంపేట డివిజన్‌లో కౌండిన్య కల్యాణ మండల నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు గౌడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గండి లింగయ్య తెలిపారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో సొసైటీ మూడో వార్షిక మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య వార్షిక నివేదికను ప్రవేశపెట్టి సంస్థ స్థితిగతులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్‌లో సొసైటీ మూడేళ్లుగా వివిధ రూపాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను వివరించారు. సమాజ సేవతో ముందుకు సాగుతున్న క్రమంలో ఎలాంటి అపోహలు ఉండవని తేల్చి చెప్పారు. మహాసభలో ఉపాధ్యక్షులు గండి నర్సయ్య, బూర అశోక్, ప్రధాన కార్యదర్శి మాచర్ల ఐలుమల్లు, సహాయ కార్యదర్శి ఊడుగుల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి గండి రాము, రామగిరి సుధాకర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు కారుపోతుల విజయ్‌కుమార్, బూర వేణు, రావుల లక్ష్మినారాయణ, గంధం చంద్రమౌళి, కక్కెర్ల అశోక్, తాళ్లపల్లి చంద్రమౌళి, కందుల శ్రీనివాస్, గిరగాని సాంబయ్య, వల్లాల శ్రీహరి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు

రాయపర్తి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని కాట్రపల్లిలోని పెద్ద చెరువు నుంచి ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్నారని విముక్తి చిరుతల కచ్చి (వీకేసీ) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెరుపల్లి ఆనంద్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రైతులకు చెరువు శిఖం భూమిలో మట్టి తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వగా నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. మట్టి తరలింపుపై విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని పెద్దచెరువును పరిరక్షించాలని కోరారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 1992–93 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు 32 ఏళ్ల మళ్లీ కలుసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. నాటి తరగతి గదులను సందర్శించి మధుర స్మృతులను గుర్తు చేసుకుని పరవశించిపోయారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు బైరెడ్డి తిరుపతిరెడ్డి, సదానందం, దేవకర్ణ, సారంగపాణిలను ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ ఏర్పాటు చేసుకుని తోటి మిత్రులకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. తమకు విద్య అందించిన పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఆర్.రాంరెడ్డి, పెండ్యాల రాజు, అమ్మ మల్లయ్య, మేర్గు శ్రీనివాస్, అండ్ర రత్నాకర్‌రెడ్డి, జంగ రంగారెడ్డి, నాతి సురేశ్, ఉమారెడ్డి, రమేశ్, బొమ్మినేని సంధ్యారాణి, వడ్డెపల్లి విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి చేయూత

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదవనున్న నిరుపేద విద్యార్థిని, హనుమకొండకు చెందిన కోమల్ల భవ్యకు విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీజు చెల్లింపునకు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ఆదివారం జరిగిన సమావేశంలో దాతల సహకారంతో రూ.50 వేల విలువగల చెక్కును ఆ విద్యార్థినికి అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ తెలిపారు. ఆ విద్యార్థికి ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరానికి సంబంధించిన ఫీజు కూడా చెల్లించేందుకు విద్యా ఫౌండేషన్ బాధ్యత తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు దాతలు కుందావజ్జుల కృష్ణమూర్తి, కెప్టెన్ రమాదేవి, తెలంగాణ స్త్రీ సేవా సంస్థ బాధ్యులకు మహేందర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ బాధ్యులు నరేందర్, వేదాంతం లక్ష్మమ్మ, లీల, నర్సింగరావు, విష్ణుమూర్తి, సోమయ్య, అనిత, వసంత, ఒయాసిస్ నిర్వాహకుడు చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు' నిరంతర ప్రక్రియ



వర్ధన్నపేట : ముగ్గు పోస్తున్న వెంకటయ్య



నల్లబెల్లి : మంజూరు పత్రాలు అందజేస్తున్న శేఖర్

- మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య

వర్ధన్నపేట : ఇందిరమ్మ ఇళ్ల మంజూరును నిరంతర ప్రక్రియగా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ నరుకుడు వెంకటయ్య తెలిపారు. మండలంలోని రంధన్‌తండా, చంద్రుతండా, ఇల్లంద, కట్ర్యాల, చెన్నారం, దివిటిపెల్లి గ్రామాల్లో పలువురి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, సీనియర్ నాయకుడు పోశాల వెంకన్నతో కలిసి వెంకటయ్య ఆదివారం ముగ్గు పోసి మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బండారి సతీశ్ గౌడ్, కునూర్ సుధాకర్ గౌడ్, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి గజ్జెల సదయ్య, మైనార్టీ మండల అధ్యక్షుడు అక్బర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాంపెల్లి రవీందర్, తీగల సునీత గౌడ్, తాటికాయల కుమారస్వామి, దొమ్మటి రాము గౌడ్, ఎలికట్టె చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాల పంపిణీ

నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపులలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారి శేఖర్ గౌడ్ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేలా కృషి చేస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొట్ల ఇంద్రసేన, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాలకుర్తి కృష్ణవేణి, ధర్మారం నర్సక్క, రవీందర్, బత్తిని రవి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మహిళలకు వైద్యసేవలే లక్ష్యం

- ప్రముఖ వైద్యురాలు అశ్రిత



మాట్లాడుతున్న డాక్టర్ అశ్రిత

వర్ధన్నపేట : పల్లెల్లో మహిళలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు లక్ష్మీనర్సింహ ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్యురాలు అశ్రిత తెలిపారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహ ఆస్పత్రి సహకారంతో పట్టణంలోని కోనాపురంలోని మండల ప్రజాపరిషత్ ప్రైమరీ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. ఎండాకాలం ముగియనప్పటికీ కొద్ది రోజులుగా ముందస్తు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుని ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. తాగునీరు, ఆహారం పట్ల జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్యం నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. తొలుత పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మహిళలకు సేవలు అందించే లక్ష్యంతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ సుభాష్, పాషా, నర్సులు కృష్ణవేణి, స్రవంతి, బాలవికాస ప్రతినిధులు రాణి, అనురాధ, చందన, స్వాతి, మంజుల పాల్గొన్నారు.

చివరి మజిలీ రహదారికి మరమ్మతు



రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కమిటీ సభ్యులు

- మాజీ ఎంపీపీ చొరవతో సమస్య పరిష్కారం

నల్లబెల్లి : మండలంలోని గొల్లపల్లిలో చివరి మజిలీ (స్మశాన వాటిక)కు వెళ్లే దారి వర్షాలు కురిస్తే బురదమయమై నడవలేని స్థితికి చేరుకుంటుంది. గ్రామంలో ఎవరు మృతి చెందిన స్మశాన వాటికకు వెళ్లే దారి కనీసం నడవలేని దుస్థితిలో ఉంది. ఈ సమస్యను గ్రామస్తులు పలుమార్లు అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలా ల్లేవు. వర్షాకాలం మొదలవుతున్న ప్రస్తుత తరుణంలో గ్రామస్తులు సమస్య పరిష్కార విషయమై ఇటీవల సమావేశమై చర్చించారు. దాతల సహకారంతో రోడ్డు మరమ్మతు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి చొరవ తీసుకుని రోడ్డు మరమ్మతుకు నడుం బిగించారు. రెండ్రోజుల క్రితమే గ్రామస్తులతో కలిసి రోడ్డును సందర్శించి సమస్యను అధ్యయనం చేశారు. తాజాగా సోమవారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పిండి కుమారస్వామి, ఎర్ర కృష్ణయ్య, దాసి రాజ్‌కుమార్, కూస కళింగరాజు, శ్రీపతి కొమురయ్య, చల్ల రాజయ్య, లెంకాల సాయిలు, సింగరబోయిన కట్టయ్య, సురేందర్, ఇమ్మడి రమేష్, పొన్నాల యుగేందర్ పర్యవేక్షణలో రూ.50 వేల అంచనా వ్యయంతో రోడ్డుపై మొరం పోయించి చదును చేయించారు. మరమ్మతు పనులు చేయించారు. గ్రామస్తులు సారంగపాణిని సన్మానించారు.

చిరువర్షానికే నడవలేని స్థితి



గొల్లపల్లి స్మశానవాటికకు వెళ్లే రోడ్డు చిరువర్షానికే బురదమయమై నడవలేని స్థితిలో ఉంది. చివరి మజిలీ కార్యక్రమాలు నిర్వహణలో గ్రామస్తుల సమస్యలు గ్రామాభివృద్ధి కమిటీ వివరించింది. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల, గ్రామస్తుల కోరిక మేరకు రూ.50 వేలతో రోడ్డుపై మొరం పోయించి చదును చేయించి మరమ్మతులు చేయించాం.

\- బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ

నూతన మంత్రులకు అభినందన



మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : కొత్తగా మంత్రి పదువులు చేపట్టిన సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌లను స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో ఆదివారం వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. వివేక్, లక్ష్మణ్‌లకు మంత్రి పదవులు వరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రులను ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, గద్దం విష్ణువర్ధన్ తదితరులున్నారు.